క్లుప్తంగా

ఈ-క్రాప్‌తోనే ప్రభుత్వ పథకాలు



రామరాజులంక పొలంబడిలో మాట్లాడుతున్న ఏఓ రాకేశ్

మలికిపురం: ఈ–క్రాప్ నమోదుతోనే ప్రభుత్వ పథకాలు అమలవుతాయని మండల వ్యవసాయాధికారి ఎస్.రాకేశ్ పేర్కొన్నారు. మంగళవారం మలికిపురం మండలం రామరాజులంక గ్రామంలో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రాకేశ్ పాల్గొని ఈ–క్రాప్ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గ్రామంలో ఇరిగేషన్ కాలువలు, డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేయించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, సర్పంచ్ కాకర శ్రీనివాస్, ఎంపీటీసీ మేడిచర్ల వెంకటరాజు, వైస్ ప్రెసిడెంట్ మేడిచర్ల గంగన్న, ముద్దల శ్రీను, రావి గోపాలకృష్ణ, దేశినేడి ఉదయభాస్కరరావు, చంటి, పశు వైద్యాధికారి డి.శివకుమార్, అగ్రికల్చరల్ అసిస్టెంట్ శ్రీరామ్, సందీప్ పాల్గొన్నారు.

సంఘాల అభ్యున్నతికి టాండన్ రాజు విశేష కృషి



టాండన్ రాజును సత్కరిస్తున్న సమాఖ్య సభ్యులు

సఖినేటిపల్లి: రాజోలు తాలూకాలోని సమష్టి వ్యవసాయ సహకార సంఘాల అభ్యున్నతికి సంఘ గౌరవ అధ్యక్షుడు, మోరి మహిమా సీపీసీ చైర్మన్ ఓగూరి టాండన్ రాజు విశేష కృషి చేస్తున్నారని సదరు సంఘాల సమాఖ్య ప్రశంసించింది. ఈ మేరకు మంగళవారం మోరి గ్రామంలో మహిమా కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ(సీపీసీ) కార్యాలయంలో టాండన్ రాజును సమాఖ్య కార్యవర్గం, పలు సంఘాల రైతులు దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఇంజేటి జీవన్ రాజు, చింతా శేషు, తోటె జాన్‌బాబు, నల్లి సత్యం, తరపట్ల రవికుమార్, గెడ్డం బాలరాజు, ఓగూరి బాబులు, గెడ్డం సూర్యారావు, తాడి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి డిబేట్ పోటీలకు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కడలి సాయిరామ్ మంగళవారం తెలిపారు. ఈ నెల 1వ తేదీన అమలాపురం జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర–2047 వక్తృత్వ, వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారన్నారు. పోటీల్లో డిబేట్ విభాగం నుంచి డి.స్నేహ సిరి, ఎస్.మనస్వినిలు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ఎస్‌ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ, ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, వెన్నపు సత్యనారాయణ, ఎం.ఎల్.గాయత్రి, టీఎస్ ఎస్.మూర్తి తదితరులు అభినందించారు.

మద్యం షాపుల మూత



కొత్తపేటలో నిరసన తెలుపుతున్న మద్యం షాపుల ఉద్యోగులు

కొత్తపేట: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో మద్యం షాపులను మూసేశారు. గత ప్రభుత్వం మద్యం పాలసీ ద్వారా ఉద్యోగావకాశాలు పొందిన తాము కొత్త ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీతో ఉద్యోగాలు కోల్పోతున్నామని వాపోయారు. తాము రోడ్డున పడకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

మద్యం షాపుల మూసివేత

పి.గన్నవరం: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం షాపులు మూసివేసి నిరసన తెలిపారు. మండలంలోని ఆరు మద్యం షాపులు మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం మద్యం షాపులను ప్రైవేటు పరం చేస్తున్న నేపథ్యంలో తమకు ప్రభుత్వ విభాగాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల రాష్ట్రంలో 15,000 కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కత్తిమండ.. ఆక్రమణలే నిండా

- ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చినా స్పందన కరవు
- పట్టించుకోని రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు



విశ్వేశ్వరాయపురం పంచాయతీ ఎదుట కత్తిమండ డ్రైన్‌పై అక్రమ నిర్మాణం

మలికిపురం: రాజోలు దీవిలో ప్రధాన మీడియం డ్రైన్ ఇది. పేరు కత్తిమండ. నియోజకవర్గంలో రాజోలు మండలం, మలికిపురం మండలాల్లో వ్యవసాయ పొలాల నుంచి ముంపు, మురుగు నీరు దిగేందుకు ఇదే ప్రధాన ఆధారం. అంతేకాకుండా మలికిపురం మండలంలోని సముద్ర తీరంలో సుమారు ఐదు వేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగు నీరందించే శంకరగుప్తం ఎత్తి పోతల పథకం ముందుకు సాగేందుకు ఈ డ్రైన్ అవసరం. అంతటి కీలకమైన కత్తిమండ డ్రైన్ ఆక్రమణల చెరలో చిక్కుకుంది. అక్రమ నిర్మాణాలతో సతమతమవుతోంది. గతంలో సుమారు 200 లింక్‌ల వెడల్పు ఉన్న ఈ డ్రైన్ ఆక్రమణల కారణంగా ప్రస్తుతం 30 లింక్‌ల వెడల్పు వరకే మిగిలినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే డ్రైనేజీ పూడుకుపోయి నీరు దిగక రైతులు ఇబ్బందులు పడుతుంటే అక్రమ నిర్మాణాలతో సమస్య మరింత జటిలమవుతోంది.

రాత్రికి రాత్రే షెడ్డు నిర్మాణం

విశ్వేశ్వరాయపురంలో వేప చెట్టు మీడియం డ్రైన్ నుంచి ప్రారంభమై మూడు కిలోమీటర్లు ప్రవహించి మోరిపోడు, కత్తిమండ గ్రామాల మధ్య శంకరగుప్తం మేజర్ డ్రైన్‌లో కలుస్తుంది. ఈ డ్రైన్ ద్వారా వచ్చే చప్పనీటిని ఆధారం చేసుకునే ఐదేళ్ల క్రితం శంకరగుప్తం మేజర్ డ్రైన్‌పై సుమారు రూ.28 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మించారు. కత్తిమండ మీడియం డ్రైన్ ద్వారా శంకరగుప్తం మేజర్ డ్రైన్‌లో పడే చప్పనీటిని లిఫ్ట్ చేసి శంకరగుప్తం, చింతలమోరి గ్రామాల్లో అనేక ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. రాజోలు మండలంలో రాజోలు, శివకోడు, బి.సావరం, చింతలపల్లి, మలికిపురం మండలంలో లక్కవరం, ఇరుసుమండ, విశ్వేశ్వరాయపురం, గుడిమెళ్లంక, మట్టపర్రు, దిండి, మేడిచర్లపాలెం, మలికిపురం, కత్తిమండ తదితర గ్రామాల వ్యవసాయ ముంపునీరు, మురుగు నీరు ఈ డ్రైన్ ద్వారానే ముందుకు సాగాలి. ఇప్పటికే డ్రైన్ పూడుకుపోవడంతో మరమ్మతులు చేపట్టడానికి ఆక్రమణలు అడ్డంకిగా మారాయి. డ్రైన్‌కు మూడు కిలోమీటర్ల పొడవునా చాలామంది అక్రమ నిర్మాణాలతో పాగా వేశారు. విశ్వేశ్వరాయపురం పంచాయతీ వద్ద డ్రైన్‌పై ఇటీవల ఆర్‌అండ్‌బీ నిర్మించిన రిటైనింగ్ వాల్‌పై ఒక ప్రభుత్వ టీచర్ మరో శ్లాబ్‌ను వేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ప్రారంభించారు. దీనిపై రైతులు అభ్యంతరం పెట్టడంతో తాత్కాలికంగా పనులు నిలిపేసిన ఆయన రెండు రోజుల్లో రాత్రికి రాత్రే షెడ్డు నిర్మించేశారు. ఇప్పటికే ఆయనకు మూడుసార్లు నోటీసులు జారీ చేసినా స్పందన కొరవడిందని అధికారులు చెబుతున్నారు.

మహిళా జేఈ ఒంటరి పోరాటం

డ్రైన్‌పై అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు మండల డ్రైనేజీ మహిళా జేఈ బి.రేష్మారాణి ఒంటరి పోరాటం చేస్తున్నారు. మూడు నెలల నుంచి ఆక్రమణల తొలగింపుపై మండల రెవెన్యూ, పంచాయతీ, డ్రైనేజీ, ఆర్‌అండ్‌బీ అధికారులకు సైతం నోటీసు కాపీలను అందిస్తున్నా అక్కడి నుంచి కనీస స్పందన కరవైంది. విశ్వేశ్వరాయపురం పంచాయతీ వద్ద డ్రైన్ స్థలంలోనే ఆర్‌అండ్‌బీ రోడ్డు సైతం ఉంది. ఒక వైపు డ్రైన్ ఆక్రమణ, మరోవైపు ఆర్‌అండ్‌బీ రోడ్డును సైతం ఆక్రమించి ఇక్కడ అక్రమ నిర్మాణం జరిగింది. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులకు చీమ కుట్టినట్టైనా లేకపోవడం విడ్డూరం. రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ నివాసం ఉంటున్న విశ్వేశ్వరాయపురంలో ఆయన నివాసానికి సమీపంలోనే అక్రమ నిర్మాణాలు సాగుతుండడం గమనార్హం.

బాధ్యులకు నోటీసులిచ్చాం



కత్తిమండ డ్రైన్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయి. రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. డ్రైన్ మరమ్మతులకు ఆక్రమణలు అడ్డంకిగా మారాయి. ఇప్పటికే బాధ్యులకు నోటీసులు ఇచ్చాం. రెవెన్యూ, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు సహకరిస్తే ఆక్రమణలు తొలగించడానికి వీలవుతుంది.
– బి.రేష్మారాణి, డ్రైనేజీ ఏఈ, మలికిపురం

పోలీస్ ప్రొటెక్షన్ కోరాం



డ్రైన్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై డ్రైనేజీ శాఖ అధికారులు లేఖ ఇవ్వడం వాస్తవమే. అయితే ఆక్రమణల తొలగింపు కోసం పోలీస్ ప్రొటెక్షన్ కోరాం. అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ఆక్రమణలు తొలగిస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.
– పీఎస్ రాజు, ఇన్‌చార్జి తహసీల్దార్, మలికిపురం

ఇదేం ఎండ.. బాబోయ్!



అంబాజీపేటలో ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

ఉక్కపోతతో బెంబేలెత్తిపోతున్న ప్రజలు

అంబాజీపేట: సాధారణంగా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలు వచ్చాయంటే చాలు ఎడతెరిపి లేని వర్షాలతో వాతావరణం చల్లబడుతుంది. అయితే ఈ ఏడాది మాత్రం ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సైతం ఎండ వేడిమి అల్లాడిస్తోంది. ప్రస్తుతం పి.గన్నవరం నియోజకవర్గంలో వాతావరణం రోహిణి కార్తె ఎండలను తలపిస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజలు వెనుకడుగేస్తున్నారు. ఏటా జులై నుంచి ఎండలు తగ్గుముఖం పడతాయి. అయితే ఈఏడాది మాత్రం గత రెండు నెలలుగా వేసవిని తలపిస్తూ ఎండలు మండుతున్నాయి. ప్రస్తుతం 32 నుంచి 36 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం అంబాజీపేటలో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా మధ్యాహ్నం సమయంలో జన సంచారం కనిపించడం లేదు.

చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించు తల్లీ



సీహెచ్ గున్నేపల్లి ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

మామిడికుదురు: తన రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా మాట్లాడిన సీఎం చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించమని కోరుతూ పి.గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ నాయకులు సత్తెమ్మ తల్లిని వేడుకున్నారు. మామిడికుదురు మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము ఆధ్వర్యంలో మంగళవారం కాట్రేనికోన మండలం చెయ్యేరు గున్నేపల్లి సత్తెమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి మాట్లాడుతూ చంద్రబాబు తన అసత్య ప్రచారంతో వైఎస్సార్ సీపీపై బురద చల్లే ప్రయత్నం చేసి ఆ బురదను తానే అంటించుకున్నారని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలే చంద్రబాబు తప్పుడు ప్రచారానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, కుడుపూడి విద్యాసాగర్, నక్కా వెంకటేశ్వరరావు, తోరం భాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, మిండగుదుటి చిన్ని, మట్టపర్తి శివ, మట్టపర్తి పండు, కొర్లపాటి కోటబాబు, దొమ్మేటి దుర్గారావు, పిల్లి శ్రీనివాస్, తేతల మోహన్‌రెడ్డి, చెల్లింగి రామకృష్ణ, బాలం రమేష్, కొమ్ముల సూరిబాబు, కొమ్ముల చిన్ని, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మలికిపురంలో ఎమ్మెల్యే దేవవరప్రసాద్‌ను కలిసిన సహకార ఉద్యోగులు

మలికిపురం: సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్‌కు కోనసీమ సహకార ఉద్యోగుల సంఘం నేతలు వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే దేవవరప్రసాద్, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహరావులను మంగళవారం మలికిపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, 2019 తరువాత నియమించిన ఉద్యోగులను తొలగించవద్దని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కోశాధికారి పెంకె సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు మేడిచర్ల రామలింగేశ్వరరావు, మట్టపర్తి జయరాం, బి.లీలాకృష్ణ, బి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు



కొత్తపేటలో ఎంపీడీఓ మహేశ్వరరావు, ఎస్‌ఏ శశికుమార్, శ్రీనివాస్‌లను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు తదితరులు

కొత్తపేట: విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసి, ప్రజలకు ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి తగిన గుర్తింపు ఉంటుందని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. కొత్తపేట ఎంపీడీఓగా పనిచేసి రావులపాలెం బదిలీ అయిన మహేశ్వరరావు, శంఖవరం బదిలీ అయిన సీనియర్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) డి.శశికుమార్, పి.గన్నవరం బదిలీ అయిన టైపిస్టు ఎం.శ్రీనివాస్ వీడ్కోలు కార్యక్రమం మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ పరిపాలనాధికారి (ఏఓ) ఎం.హరికృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం బదిలీ అయిన అధికారులు, సిబ్బందిని ఎంపీపీ గంగాధరరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల బ్రహ్మానందం, నేలపూడి భీమరాజు, ధూళి సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు బీర శ్రీను, గ్రామ కార్యదర్శులు మంగిపూడి రాంబాబు, పి.సత్తిబాబు, జేఏ చాందిస్ పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

అంబాజీపేట: వరి పంటను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారంలో సర్పంచ్‌లు కాండ్రేగుల శ్రీనివాసరావు, దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం వరిపై ఆకు ఎండు తెగులు, సుడి దోమ ఆశిస్తుందని రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ ఏఈఓ వెంకటేశ్వరరావు, వీహెచ్‌ఏలు ఎం.ప్రియాంక, వైడీ భీమారావు, ఎంఎం శెట్టి, కమిడి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

సఖినేటిపల్లి: మండల పరిధిలోని వీవీమెరక, అంతర్వేదిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు ఓగూరి రత్న కుమారి, నల్లి లీలావతి అధ్యక్షతన ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఆధునిక సాగు పద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందటానికి విధి విధానాలపై ఏఓ పీవీ నరసింహరావు వివరించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ కె.సునీల్ గాంధీ, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ జూలీ, మాజీ సర్పంచ్‌లు నల్లి సురేంద్ర, ఈద రవిరెడ్డి, తాడి సత్యనారాయణ, తోటె జాన్‌బాబు, కొరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విజేతలకు బహుమతులు



మామిడికుదురులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం నిరంజని



అంబాజీపేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం సాయిరామ్



మలికిపురంలో చెకుముకి విజేతలతో ఉపాధ్యాయులు

మామిడికుదురు: చెకుముకి మండల స్థాయి పోటీలు మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగాయి. మండల పరిధిలోని 12 ప్రభుత్వ, రెండు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఎ.కొండయ్య, ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. మొగలికుదురు జెడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన కె.దినేష్ కుమార్, కె.దివ్యశ్రీ, కె.లక్ష్మీశ్రీకళ బృందం ప్రథమ, ఈదరాడ స్కూల్‌కు చెందిన వై.ముఖేష్, సీహెచ్ జేమ్స్ విక్కీ, ఎల్.చరణ్ జట్టు ద్వితీయ, పాశర్లపూడిలంకకు చెందిన బి.షలీమ్‌రాజు, వై.మనోజ్‌శ్రీ, ఎం.జయసాయి బృందం తృతీయ బహుమతులు గెలుపొందారు. విజేతలకు హెచ్‌ఎం సీహెచ్ నిరంజని బహుమతులు అందజేశారు.

అంబాజీపేట: చెకుముకి మండల స్థాయి సైన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేసినట్లు హెచ్‌ఎం కడలి సాయిరామ్ తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి చెకుముకి పోటీలను మంగళవారం నిర్వహించారు. పోటీల్లో ఇరుసుమండ సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థులు జి.అఖిల, కె.శ్యామ్, బి.జెసికా ఇవాంజిలిన్ మొదటి స్థానంలో నిలిచారన్నారు. పుల్లేటికుర్రు హైస్కూల్ నుంచి టీఎల్ఎస్, శ్రీనివాస్, ఎం.జ్యోతిసాయి ప్రసాద్, ఎం.అలేఖ్యలు ద్వితీయ స్థానంలోను, గంగలకుర్రు హైస్కూల్ నుంచి ఆర్.శైలజ అన్నపూర్ణ, కె.మాలతి, డి.గాయత్రి మంజూషలు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమోంటోలు, ప్రశంసా పత్రాలను హెచ్‌ఎం సాయిరామ్ అందజేశారు. ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, ముంజవరపు సూర్యనారాయణ పాల్గొన్నారు.

మలికిపురం: మండల స్థాయి చెకుముకి పోటీల్లో మంగళవారం బట్టేలంక ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో బట్టేలంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో ఇరుసుమండ ఉన్నత పాఠశాల, తృతీయ స్థానంలో చింతలమోరి ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. విజేతలకు మలికిపురం మండల విద్యాశాఖాధికారి వైవీ సత్యనారాయణ బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీవీఎస్ఎస్ హనుమంతరావు, సీహెచ్ తులసీరావు, బేతినేడి శ్రీనివాసరావు, వివేకానంద ప్రసాద్, సీహెచ్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండల పరిధిలోని అంకంపాలెం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు, ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్‌లో చదువుతున్న మరో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఎంఈఓ వరప్రసాద్ తెలిపారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పరీక్షల్లో విజేతలుగా నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం పి.సోమసూర్యకుమారి మంగళవారం తెలిపారు. రావి హర్షిత్, సీహెచ్ అనన్య, ఆర్.ఇందు జాహ్నవి ఎంపికైనవారిలో ఉన్నారు. సర్పంచ్ పోతురాజు కిషోర్‌కుమార్, అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతురాజు నాగేంద్రకుమార్, ఎంఈవో–1 డి.కిషోర్‌కుమార్, ఎంఈవో–2 మద్దాలి వెంకటేశ్వరరావు అభినందించారు.

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో మంగళవారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ జరిగింది. మండల యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక మండల శాఖ అధ్యక్షుడు ఖాన్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చెకుముకి టాలెంట్ టెస్టులో చక్కని ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అనంత శ్రీనివాస్, మండల యూటీఎఫ్ శాఖ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాస్, ఎస్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు జి.సుదర్శన చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువుదీరిన కనకదుర్గ ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ శరన్నవరాత్ర సహిత లక్ష కుంకుమార్చన మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 3వ తేదీ గురువారం ఉదయం 6.54 గంటలకు ఉత్సవాల నిర్వహణకు కలశస్థాపన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపింది. రోజూ లక్ష్మీగణపతి జపం, మహాలింగార్చన, సూర్యనమస్కారాలు, పార్థివ లింగానికి అభిషేకం, బిల్వార్చన, లక్ష కుంకుమార్చన, లక్ష్మీగణపతి హోమం, రుద్రహోమం, లలితా హోమం జరుగుతాయన్నారు. 12వ తేదీన విజయదశమి సందర్భంగా మహా పూర్ణాహుతి, శమీపూజతో శరన్నవరాత్ర ఉత్సవాలు సంపూర్ణమవుతాయన్నారు.

16న రక్షిత మంచినీటి పథకం ప్రారంభం

అంబాజీపేట: దీర్ఘకాలంగా ప్రారంభానికి నోచుకోని మాచవరం శివారు కామయ్యకోడులో నిరుపయోగంగా ఉన్న రక్షిత మంచినీటి పథకాన్ని ఈ నెల 16వ తేదీన ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. కామయ్యకోడులో ఉన్న రక్షిత మంచినీటి పథకాన్ని మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఇప్పటివరకూ ఎందుకు ప్రారంభించలేదో అడిగి తెలుసుకున్నారు. త్వరలో మాచవరం గ్రామస్తులకు రక్షిత మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, గణపతి వీర్రాఘవులు, బొంతు పెదబాబు, మైపాల తాతాజీ, అరిగెల సూరిబాబు పాల్గొన్నారు.

ప్రజా సంఘాలను పటిష్ట పరచాలి



ఆలమూరులో జరిగిన సీపీఐ సమావేశంలో ప్రసంగిస్తున్న సత్తిబాబు

ఆలమూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలకుల తప్పిదాలపై పోరాడేందుకు ప్రజా సంఘాలను మరింత పటిష్టం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జె.సత్తిబాబు అన్నారు. ఆలమూరులో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ జి.రవికుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా కార్యదర్శి సత్తిబాబు పాల్గొని ప్రసంగించారు. సంఘ సభ్యులందరూ దృఢమైన ప్రజా సంఘాల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. అనంతరం సభ్యులందరూ జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సమాఖ్య, విద్యార్థి సంఘాలను మరింత విస్తృత పర్చాలని తీర్మానించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.రామకృష్ణ, జి.యేసుదాసు, జె.యేసురాజు, సాకా వరలక్ష్మి, కొల్లి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలయోగి చిరస్మరణీయుడు



దిండిలో బాలయోగి విగ్రహానికి నివాళులర్పించిన నేతలు

నెట్‌వర్క్: రాజకీయాల్లో శత్రువులు లేని వ్యక్తిగా నిలిచిన చిరస్మరణీయుడు జీఎంసీ బాలయోగి అని రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం దిండి వై.జంక్షన్‌లో బాలయోగి జయంతిని నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ కేతా శ్రీను, సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్ బందెల పద్మ తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్‌లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్‌లో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, అయినవిల్లి మండలం కె.జగన్నాథపురంలో బాలయోగి చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగుమళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలయోగి జయంతి వేడుకలు జరిగాయి.

కళాకృతుల తయారీపై శిక్షణ

పి.గన్నవరం: విద్యార్థుల్లో ప్రతిభకు పదునుబెట్టే విధంగా కాగితాలతో వివిధ కళాకృతుల తయారీపై పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాల అధ్యాపకురాలు బి.చిట్టితల్లి మంగళవారం శిక్షణ ఇచ్చారు. చతురస్ర, దీర్ఘ చతురస్రాకార కాగితాలను కట్ చేయకుండా, కేవలం మడతలతో బొమ్మలను చేసే విధానంపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. జపాన్ దేశస్థుల కళ అయిన ‘ఓరిగామి’ని ఇంటర్నెట్‌లో అధ్యయనం చేసి కాగితాలను కట్ చేయకుండా కళాకృతులను తయారు చేయడాన్ని నేర్చుకున్నట్టు చిట్టితల్లి వివరించారు. పాఠశాల హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్, పీఈటీ బీమేంద్ర, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ

రాజోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీల్లో రాజోలు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. యోగా, చెస్, తైక్వాండో పోటీల్లో ఎస్.కాసు తులసి తేజశ్రీ, బి.జైమనోజిని, పి.హేమధనశ్రీ, వి.జ్యోత్స్న, వై.గంగాభవానీలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుహాసిని తెలిపారు. ఎంఈఓలు నల్లి మనోహరం, ప్రసాదరావు, విద్యాకమిటీ చైర్మన్ బి.వెంకట రామారావు, షేక్ ముంతాజ్, వ్యాయామ ఉపాధ్యాయురాలు కట్టా శ్రీదేవి విద్యార్థులను అభినందించారు.

గ్రామ సభల నిర్వహణకు ప్రత్యేకాధికారులు

సఖినేటిపల్లి: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం గ్రామ పంచాయతీలు అన్నింట్లోనూ చట్టబద్ధమైన గ్రామ సభల నిర్వహణకు ప్రత్యేకాధికారులను నియమించినట్టు ఎంపీడీవో పీవీ సత్యనారాయణ మంగవారం తెలిపారు. సర్పంచ్‌ల అధ్యక్షతన కార్యదర్శులు వీటిని నిర్వహించాలని ఆయన సూచించారు. ఇందుకు గాను 16 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల జాబితాను ప్రకటించారు.